
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం ౹ 18 ౹ డిసెంబర్ ౹ 2023



సోమశిలలో 36.299 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 36.299 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 671 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	63,870
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,736
3శాతం జీఎస్టీతో	రూ.5,908
నవర (8గ్రా)	రూ.47,264

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0 /23.5

ఆదివారం గాలిలో తేమ 78 శాతం ఉంది. సోమవారం జిల్లాలో ఉష్ణోగ్రతలు, ఎండతీవ్రత సాధారణంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు రూరల్ డివిజన్ విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం సోమవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జయకృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని విద్యుత్ భవన్‌లోని స్కాడా కార్యాలయంలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్‌సెల్ ఫోరం(సీజీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యుడు రామమోహన్‌రావు, స్వతంత్ర్య సభ్యురాలు ఈశ్వరమ్మ, డిస్కం అధికారులతోపాటు జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ పాల్గొంటారని తెలిపారు. రూరల్ ప్రాంత విద్యుత్ వినియోగదారులు హాజరై విద్యుత్ సమస్యలపై రాతపూర్వకంగా ఫిర్యాదులు చేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

మెడికల్ కళాశాలలో అనస్తీషియాపై అవగాహన



మాట్లాడుతున్న వైద్య కళాశాల ప్రిన్సిపల్ వసుంధరాదేవీ

నెల్లూరు సిటీ: నగరంలోని మెడికల్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ జోనల్ పరిధిలోని గుంటూరు, ఒంగోలు, నెల్లూరు మెడికల్ కళాశాలల్లోని వైద్య విద్యార్థులకు అనస్తీషియాపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ వసుంధరాదేవీ మాట్లాడుతూ వివిధ కళాశాల విద్యార్థులు తమ అనుభవాలను పంచుకోవడానికి సరైన వేదికగా ఏర్పాటైందని తెలిపారు. ముఖ్యంగా గర్భిణులకు ఇచ్చే అనస్తీషియాపై పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో అనస్తీషియా హెచ్‌ఓడీ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ జమున, డాక్టర్ శాంతి, నారాయణ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ కృష్ణచైతన్య, కాటూరి మెడికల్ కళాశాల ప్రొఫెసర్ వెంగమాంబ, గుంటూరు మెడికల్ కళాశాల అసోసియేషన్ ప్రొఫెసర్ నాగభూషణం, ఒంగోలు మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గ్రేస్ ప్రియాంక పాల్గొన్నారు.

24న ఆలిండియా చెస్ పోటీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర చెస్ అసోసియేషన్, డాట్స్‌లింక్ ఆఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన స్థానిక రంగనాయకులపేటలోని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ పాన్‌బ్రోకర్స్ కల్యాణ మండపంలో ఎ.పి.సి.ఎ. సెక్రటరీ కప్, ఆల్ ఇండియా ఓపెన్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్ ఆదివారం తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రోత్సాహకంగా రూ.2 లక్షల నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన జూనియర్స్‌కు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు. క్రీడాకారులకు, వారి తల్లిదండ్రులకు భోజనం, వసతి సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఫిడే క్రీడాకారులు సుమారు 200 మందికి పైగా పాల్గొంటున్నారని తెలిపారు. ఆసక్తి గల వారు టోర్నీ నిర్వాహకులు రామ్‌లక్ష్మణ్‌లను 96521 52055, 83411 47514 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

గ్రూపు-2 ప్రిలిమినరీకి ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్: ఏపీపీఎస్సీ గ్రూప్-2 రిక్రూట్‌మెంట్ ప్రిలిమినరీ పరీక్ష కోసం ఉమ్మడి జిల్లాకు చెందిన పేదల అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి బి.భాస్కర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు ఈ నెల 22వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 27 నుంచి 50 రోజులపాటు ఉచిత శిక్షణతోపాటు స్టయిపెండ్, స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి తిరుపతి ఎమ్మార్ పల్లె బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను తిరుపతిలోని ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఫర్ బీసీఎస్, డోర్ నంబర్ 4-171-2లో అందజేయాలని తెలిపారు. వివరాలకు 9441456039, 9985022254, 9346221553 సెల్‌నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

సైదాపురం: మండలంలోని మొలకలపూండ్లలో ఆదివారం విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతిచెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన అడసనపల్లి ఈశ్వరయ్యనాయుడు (65) పొలం దున్నేందుకు ట్రాక్టర్‌పై బయలుదేరారు. దున్నుతున్న సమయంలో కిందకు వాలిన విద్యుత్ తీగలను సరిచేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

మత్స్యకారుల భవితకు భరోసా

- కృష్ణపట్నం తీరంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి అడుగులు
- నేలటూరు పట్టపుపాళెం వద్ద భూమిపూజ చేసిన మంత్రి కాకాణి
- 20 గ్రామాల మత్స్యకారులకు ప్రయోజనం
- రూ.25 కోట్లతో జెట్టీ నిర్మాణం
- 2 వేల మందికి ఉపాధి

ఉవ్వెత్తున ఎగసిపడే అలలను దాటుకుని సముద్రంలో వేట సాగిస్తేనే గంగపుత్రుల కడుపు నిండుతుంది. ప్రకృతి విపత్తులు, వేట విరామ సమయంలో వేట సాగక పూట గడవని పరిస్థితులు ఎదుర్కొంటారు. సముద్రంలో వేట సాగించి మత్స్యసంపదను ఒడ్డుకు చేర్చినా నిల్వ చేసుకునే అవకాశం లేక దళారులకు తెగనమ్ముకునే పరిస్థితి ఉంటుంది. విపత్తుల సమయంలో పడవలు, వలలనూ భద్రపరుచుకోవడం కష్టంగా మారుతోంది. మత్స్యకారులను ఈ దయనీయ పరిస్థితుల నుంచి గట్టెక్కిస్తూ ముత్తుకూరు మండలంలోని నేలటూరు పట్టపుపాళెం వద్ద రూ.25 కోట్ల అంచనాతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి భూమిపూజ చేశారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలోని ముత్తుకూరు మండలం కృష్ణపట్నం తీరంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఎట్టకేలకు కార్యరూపం దాల్చింది. 14 ఏళ్ల క్రితం కృష్ణపట్నం పోర్టు ప్రారంభానికి ముందు ఇక్కడి జెట్టీల కేంద్రంగా మత్స్యకారులు సముద్రంలో చేపల వేట సాగించేవారు. వలలకు చిక్కిన మత్స్యసంపదను ఆరబెట్టుకోవడం, నిల్వ చేసుకోవడం ద్వారా వందల మంది మత్స్యకారులు జీవనోపాధి పొందారు. కృష్ణపట్నం పోర్టు ప్రారంభమైన తర్వాత జెట్టీలు అదృశ్యమయ్యాయి. ఇక్కడి మెకనైజ్డ్ బోట్లు ఇతర రేవులకు తరలిపోయాయి. ఎక్కడికీ వెళ్లలేని మోటారు బోట్లు, నాన్ మోటారు బోట్లు మాత్రం నానా కష్టాల మధ్య సముద్రంలో వేట చేస్తున్నాయి. వేటాడిన తర్వాత మత్స్యసంపదను అపరిశుభ్ర వాతావరణంలో ఎండబెట్టుకొంటూ అమ్మకాలు చేసుకొనే పరిస్థితి కొనసాగుతోంది.

15 ఏళ్ల క్రితమే సర్వే

కృష్ణపట్నం పోర్టు ప్రారంభానికి ముందే బెంగళూరుకు చెందిన ఓ సంస్థ ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి గల సాధ్యాసాధ్యాలపై ఈ ప్రాంతంలో సర్వే జరిపింది. ఉప్పు కాలువలో పడవల ద్వారా పర్యటించిన నిపుణులు హార్బర్ నిర్మాణానికి రూ.300 కోట్లు అవసరమైనట్లు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. అయితే, ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. 1996లో తెలుగుదేశం ప్రభుత్వం కృష్ణపట్నం పోర్టును నాట్కో అనే ప్రైవేట్ సంస్థకు అప్పగించింది. కాగా, ఆ ప్రైవేట్ సంస్థ ఒక్క ఇటుక కూడా వేయలేకపోయింది. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ పోర్టును నాట్కో సంస్థ నుంచి నవయుగ సంస్థకు అప్పగించారు. కేవలం 4 సంవత్సరాల వ్యవధిలో ఈ సంస్థ పోర్టు నిర్మాణం పూర్తి చేసింది. ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలన్న అంశానికి అప్పుడే బీజం పడింది.

మరింత వెసులుబాటు

కృష్ణపట్నం పోర్టు సమీపంలో నేలటూరు పట్టపుపాళెం వద్ద ఏర్పాటవుతున్న ఫిషింగ్ జెట్టీ హార్బర్‌తో కోవూరు నియోజకవర్గంలోని ఇందుకూరుపేట, సర్వేపల్లి పరిధిలోని తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు మండలాల మత్స్యకారులకు ఉపయోగకరంగా ఉంటుంది. రూ.25 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ జెట్టిలో 400 వందల పడవలు నిలిచేలా బెర్త్ నిర్మాణం జరగనుంది. వలలు భద్రపరుచుకొనేందుకు, తయారు చేసుకొనేందుకు అనుకూలమైన ప్లాట్‌ఫాంలు, మత్స్యసంపద నిల్వ చేసేందుకు స్టోరేజీలు రానున్నాయి. సుమారు 2 వేల మందికి ఉపాధి లభించనుంది. మత్స్యకార మహిళలకు సైతం సమృద్ధిగా జీవనోపాధి లభించి, తద్వారా ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని పలువురు పేర్కొంటున్నారు.



ఫిషింగ్ జెట్టీ హార్బర్ పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ఫిషింగ్ హార్బర్ ఏర్పాటైతే..

కృష్ణపట్నం తీరంలో ఏర్పాటు కావాల్సిన ఫిషింగ్ హార్బర్ తర్వాత బోగోలు మండల పరిధిలోని జువ్వలదిన్నెకు తరలించారు. రూ.288 కోట్లతో చేపట్టిన ఫిషింగ్ హార్బర్ నిర్మాణం తుది దశకు చేరుకుంది. జిల్లాలో కావలి మండలం చెన్నాయపాళెం నుంచి తడ వరకూ 169 కిలోమీటర్ల మేర తీరప్రాంతం ఉంది. సుమారు 2 లక్షల మంది మత్స్యకారులు సముద్రంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఏడాదికి 1.05 లక్షల (చేప, రొయ్యలు కలిపి) టన్నులకు పైగా మత్స్యసంపదను కడలి గర్భం నుంచి బయటకు తీస్తున్నారు. ఇందులో కేవలం 40 శాతం మాత్రమే విదేశాలకు ఎగుమతి అవుతోంది. సరైన వసతులు, స్టోరేజ్ సామర్థ్యం లేని కారణంగా మిగిలిన 60 శాతం సరుకు దళారుల చేతుల్లోకి వెళుతోంది. మత్స్యకారుల నుంచి అతి తక్కువ ధరకు చేపలు, రొయ్యలు సొంతం చేసుకుంటున్న దళారులు చెన్నై, బెంగళూరు వంటి రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కేవలం 40 శాతం ఎగుమతుల పైనే ఏడాదికి జిల్లా నుంచి రూ.200 కోట్ల విదేశీ మారకం వస్తున్నట్లు అధికారుల అంచనా. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, కృష్ణపట్నం పోర్టు సమీపంలో మినీ హార్బర్ ఏర్పాటైతే జిల్లాలో ప్రస్తుతం లభిస్తున్న 1.05 లక్షల టన్నులు రెట్టింపు మత్స్యసంపదను మత్స్యకారులు చేజిక్కించుకునే అవకాశం ఉంది. తద్వారా విదేశీ మారకద్రవ్యం రెట్టింపు కానుందని నిపుణులు చెబుతున్నారు.

మంత్రి కాకాణి భూమిపూజ

దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న నేలటూరు ఫిషింగ్ జెట్టి హార్బర్ నిర్మాణానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి భూమిపూజ చేసి మత్స్యకారుల చిరకాల కోరికను నేరవేర్చారు. తద్వారా మత్స్యకారుల జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపుతోందని మంత్రి తెలిపారు.

గంగపుత్రులకు ప్రయోజనం



మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి భూమిపూజ చేసిన ఫిషింగ్ జెట్టి హార్బర్ వల్ల ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, చిల్లకూరు మండలాల గంగపుత్రులకు ప్రయోజనం చేకూరుతుంది. పడవలు, వలలకు భద్రత లభిస్తుంది. మత్స్యసంపదను స్థానికంగానే విక్రయించుకోవచ్చు. ఎంతో మందికి ఉపాధి లభిస్తుంది.

– బసవంగారి ఈశ్వరయ్య, నేలటూరు

ఎన్నో ఏళ్ల కల నెరవేరింది



మత్స్యకారుల కోసం ఫిషింగ్ జెట్టి హార్బర్ నిర్మించాలన్న ఎన్నో ఏళ్ల కల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కృషి వల్ల నెరవేరింది. దీనికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. మత్స్యకారుల సంక్షేమానికి ఈ ప్రభుత్వం చూపిస్తున్న శ్రద్ధకు ఇదొక ఉదాహరణ.

– యల్లంగారి వెంకటేశ్వర్లు, ఆర్అండ్ఆర్ కాలనీ.

గంగపుత్రుల సంక్షేమానికి పెద్దపీట

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేశారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నేలటూరు పట్టపుపాళెంలో రూ.25 కోట్ల అంచనాలతో నిర్మించే ఫిషింగ్ జెట్టీ హార్బర్ పనులకు ఆదివారం మంత్రి భూమిపూజ చేశారు. పడవలో ప్రయాణించి జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించిన ఫిషింగ్ జెట్టీ నిర్మాణాన్ని పలుమార్లు ముఖ్యమంత్రితో చర్చించామని, తత్ఫలితంగా ఏపీజెన్‌కో ప్రాజెక్ట్ 3వ యూనిట్‌ను జాతికి అంకితం చేసేందుకు వచ్చిన ముఖ్యమంత్రి ఈ ఫిషింగ్ జెట్టీకి శంకుస్థాపన చేస్తూ, నాన్ ఫిషర్‌మెన్ ప్యాకేజీ నిధులు విడుదల చేశారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం పనిచేసే నాయకుడని, చంద్రబాబులా ఫొటోలకు ఫోజులిచ్చే వ్యక్తి కాదని అన్నారు. వచ్చే ఏప్రిల్ 10వ తేదీ నాటికి ఫిషింగ్ జెట్టీ పూర్తవుతుందన్నారు. తోటపల్లి గూడూరు, ముత్తుకూరు మండలాలకు చెందిన 400 పడవలు ఈ జెట్టీలో సేద తీరవచ్చన్నారు.

అండగా నిలుస్తూ..

రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు అండగా నిలుస్తోందని మంత్రి కాకాణి అన్నారు. ఈ మేరకు గంగపుత్రులు బోట్లకు అవసరమైన డీజిల్‌పై రూ.9 సబ్సిడీ, వేటవిరామం సమయంలో రూ.10 వేలు భృతి ఇస్తున్నామని గుర్తుచేశారు. అలాగే వేట సమయంలో మత్స్యకారుడు మృతి చెందితే ఆ కుటుంబానికి ఇచ్చే పరిహారం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోమారు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అదానీ కృష్ణపట్నంపోర్టు సీఈఓ జీజేరావు, అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ గంటా వేణుగోపాల్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, సర్పంచ్ కనకయ్య, ఎంపీటీసీ సభ్యురాలు శీనమ్మ, నాయకులు శీపారెడ్డి రామమోహన్‌రెడ్డి, ఈపూరు కోటారెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, పెదకాపు నరసింహం, నడింకాపు భాస్కర్, చినకాపు తాతయ్య పాల్గొన్నారు.



ఫిషింగ్ జెట్టీ హార్బర్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రాంతీయ విద్యా కేంద్రాన్ని సిద్ధం చేయండి





జాతీయ విద్యావిధానంపై సదస్సును ప్రారంభిస్తున్న భారత ప్రభుత్వ పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్, ఎన్‌సీఈఆర్టీ డైరెక్టర్ దినేష్‌ప్రసాద్ శుక్లాని, రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, పాల్గొన్న అధికారులు

- భారత ప్రభుత్వ పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్
- జాతీయ విద్యావిధానంపై ప్రారంభమైన సదస్సు
- ప్రాంతీయ విద్యాకేంద్రానికి వీఆర్సీలో తాత్కాలిక భవనం ఏర్పాటు

నెల్లూరు(టౌన్): ప్రాంతీయ విద్యా కేంద్రాన్ని (రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్) తాత్కాలికంగా నెల్లూరు వీఆర్ కళాశాలలో అన్ని వసతులతో సిద్ధం చేయాలని భారత ప్రభుత్వ పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో జాతీయ విద్యావిధానంపై సదస్సును ప్రారంభించిన అనంతరం ఆయన వీఆర్ కళాశాలను సందర్శించారు. జిల్లా యంత్రాంగం రీజినల్ విద్యా కేంద్రం కోసం వీఆర్సీలో గుర్తించిన గదులను చూపించి వసతి వివరాలను కలెక్టర్ హరినారాయణన్ ఆయనకు వివరించారు. అనంతరం స్థానిక పొదలకూరు రోడ్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో ఐఎఫ్‌పీ డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా తరగతి గదిలో జరుగుతున్న విద్యాబోధనను విద్యార్థులతో కలిసి కూర్చొని విన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లు, పాఠ్యపుస్తకాలు, ఆర్వో ప్లాంట్లు, మధ్యాహ్న భోజన పథకం, జగనన్న విద్యాకానుక తదితరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు నడయాడిన జిల్లాలో ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఫౌండేషన్ విద్యను బలోపేతం చేయడానికి పాఠ్యప్రణాళికలో సమూల మార్పులు తీసుకువస్తున్నామన్నారు. విద్యాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను పరిశీలించి విద్యాశాఖ అధికారులను అభినందించారు. కార్పొరేట్ విద్యకు దీటుగా ఏపీ ప్రభుత్వం చేస్తున్న కృషి అమోఘమన్నారు. సాంకేతికతను వినియోగించడంలో ఏపీ ప్రభుత్వం అగ్రస్థానంలో ఉందని కొనియాడారు. వెంకటాచలం మండలం చవటపాళెం గ్రామ పరిధిలో ప్రాంతీయ విద్యా కేంద్రం ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించిన సంజయ్‌కుమార్ అక్కడి నుంచి ఎన్‌సీఈఆర్టీ సిబ్బందితో మాట్లాడారు. అనంతరం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో ఫోన్‌లో మాట్లాడారు. స్థల వివాదంపై జిల్లా కలెక్టర్‌తో చర్చించామని, నెల రోజుల లోపు స్థలానికి సంబంధించిన పెండింగ్ సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, పక్కా భవనాల నిర్మాణం కూడా వీలైనంత త్వరగా ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ప్రాంతీయ విద్యా కేంద్రం కోసం స్థల పరిశీలన




వెంకటాచలం: మండలంలోని చవటపాళెం గ్రామ పరిధిలో నేషనల్ కౌన్సిల్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ట్రెనింగ్ (ప్రాంతీయ విద్యా కేంద్రం) ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని భారత ప్రభుత్వ పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్, రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, కలెక్టర్ ఎం.హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ తదితరులు ఆదివారం పరిశీలించారు. కేంద్రం ఏర్పాటుకు స్థలం అనుకూలంగా ఉండడంతో వెంటనే భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సంబంధిత భూముల రైతుల వివరాలతో చర్చించి, నష్టపరిహారం చెల్లించి భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు.

ఆకట్టుకున్న స్టాల్స్

స్థానిక కస్తూర్బా కళాక్షేత్రంలో పాఠశాల విద్యకు సంబంధించి నిర్వహిస్తున్న విద్యాసదస్సు కోసం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు స్టాల్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. మనబడి నాడు-నేడు, జగనన్న విద్యాకానుక, ఇన్నోవేషన్ ప్రాక్టీసెస్ పర్సనలైజ్డ్, అడాప్టివ్ లెర్నింగ్, ప్రధాన మంత్రి పోషణ్ శక్తి నిర్మాణ్-జగనన్న గోరుముద్ద, ఫౌండేషనల్ లెర్నింగ్, లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం, సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ తదితర స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్‌ను భారత ప్రభుత్వ పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్, ఎన్‌సీఈఆర్టీ డైరెక్టర్ దినేష్ ప్రసాద్ శుక్లాని, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్, సమగ్ర శిక్ష ఎస్‌పీడీ శ్రీనివాసులు తదితరులు పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. జిల్లాలోని పలు పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు, డైట్ కళాశాల నుంచి వచ్చిన ఛాత్రోపాధ్యాయులు స్టాల్స్‌ను పరిశీలించారు. పాఠశాల విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను స్టాల్స్ రూపంలో జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జేసీ కూర్మనాథ్, మున్సిపల్ కమిషనర్ వికాస్‌మర్మత్, ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా, మైసూరు ప్రాంతీయ విద్యా కేంద్రం ప్రిన్సిపల్ వై.శ్రీకాంత్, డీఈఓ గంగాభవాని, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల తయారీ ముఠా గుట్టురట్టు

- ఐదుగురు నిందితుల అరెస్ట్
- 560 గ్రాముల మత్తు పదార్థాలు, గంజాయి స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): డార్క్ వెబ్‌లలో సేకరించిన సమాచారంతో ఓ వ్యక్తి తన స్నేహితులతో కలిసి నిషేధిత మత్తు పదార్థాలను తయారీ చేయసాగాడు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న పోలీసులు తయారీ కేంద్రంపై దాడి చేసి 560 గ్రాముల మత్తుపొడర్, 1.980 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. కీలక నిందితుడు పరారీలో ఉండడంతో అతని కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన జిల్లాలో కలకలం రేకెత్తించింది. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదివారం రాత్రి నిందితుల వివరాలను వెల్లడించారు. తిరుపతి జిల్లా గూడూరు పట్టణానికి చెందిన పి.సాత్విక్ బీటెక్ చదివాడు. బ్యాక్‌లాగ్‌లు ఉన్నాయి. విదేశాల్లో ఉద్యోగాలు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో నగదు రాకపోవడంతో మానేశాడు. సాత్విక్‌కు గూడూరు రాణిపేటకు చెందిన సీహెచ్ శ్రీనివాసులు, మొగళ్లపాళేనికి చెందిన ఎం.బాబు, గూడూరు రైల్వేస్టేషన్‌లో బిర్యానీ విక్రయించే కె.వెంకయ్య, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రస్తుతం గూడూరు రైల్వేస్టేషన్‌లో టీ విక్రయిస్తున్న వినోద్ స్నేహితులు. బాబు గూడూరు రైల్వేస్టేషన్‌లో టీ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. సాత్విక్ అతని ద్వారా ఏడాదిగా రైల్వేస్టేషన్‌లో క్యాటరింగ్ పనులకు కాంట్రాక్ట్ పద్ధతిపై నీటిని సరఫరా చేయసాగాడు. అందులోనూ ఆదాయం అంతంతమాత్రంగానే ఉంది. సాత్విక్‌కు నెల్లూరు బాలాజీనగర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పి.వేణుగోపాల్‌రెడ్డి అలియాస్ వేణురెడ్డి స్నేహితుడు. ఇద్దరూ తరచూ వివిధ వ్యాపారాలు చేయాలని మాట్లాడుకునేవారు. ఈ క్రమంలో ఆరు నెలల క్రితం వేణురెడ్డి నిషేధిత మత్తు పదార్థాలైన మెఫేడ్రోన్‌తోపాటు పలు వాటికి మార్కెట్‌లో డిమాండ్ ఉందని, వాటిని తయారు చేసి ఇస్తే తాను మార్కెట్‌లో విక్రయించి కమీషన్ ఇస్తానని సాత్విక్‌కు చెప్పాడు. తక్కువ సమయంలో అధిక మొత్తం సంపాదించవచ్చని సాత్విక్ ఆశపడి అంగీకరించాడు. సాత్విక్ ఇదే విషయాన్ని ఆయన తన స్నేహితులకు తెలియజేయడంతో వారు సహకరిస్తామన్నారు. దీంతో ఆయన డార్క్ వెబ్‌లలో మత్తు పదార్థాలను ఎలా తయారు చేయాలి? ఏయే వస్తువులు అవసరమో తెలుసుకున్నాడు. అనంతరం స్నేహితులతో కలిసి రూ.2.60 లక్షలతో తయారీకి అవసరమైన గాజు జార్లు, డ్రాపింగ్‌పునల్, మ్యాగ్నెటిక్ స్టిరర్, సపరేషన్ ఫునల్, వేయింగ్ మెషీన్లను ఆన్‌లైన్‌లో, కెమికల్ లిక్విడ్స్‌ను తిరుపతిలోని ఓ బయో సైంటిఫిక్ షాపులో కొనుగోలు చేశారు. అనంతరం వినోద్ ద్వారా 20 రోజుల క్రితం నెల్లూరు రూరల్ మండలం ధనలక్ష్మీపురం గ్రామం సామంతులవారితోపు ఏ.వి.రెడ్డి కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని గుట్టుచప్పుడు కాకుండా మత్తు పదార్థాలు తయారు చేయసాగారు. ఈ క్రమంలోనే వినోద్ 2 కేజీల గంజాయిని తీసుకువచ్చి అదే ఇంట్లో ఉంచాడు. దీనిపై ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డికి పక్కా సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ఏఎస్పీ డి.హిమవతి పర్యవేక్షణలో నెల్లూరు రూరల్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి, ఎస్‌బీ, సెబ్ ఇన్‌స్పెక్టర్లు కె.రామకృష్ణారెడ్డి, హౌస్సేన్, డ్రగ్స్ కంట్రోల్, రెవెన్యూ అధికారులు ఆదివారం తెల్లవారుజామున దాడి చేశారు. నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి సుమారు రూ.15 లక్షల విలువ చేసే 560 గ్రాముల నిషేధిత మత్తుపొడర్‌ను, 1.980 కేజీల గంజాయి, మత్తుపదార్థాల తయారీకి ఉపయోగించే 48 రకాల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కీలక నిందితుడు పి.వేణుగోపాల్‌రెడ్డి పరారీలో ఉండడంతో అతని కోసం గాలిస్తున్నారు. నిందితులను అరెస్ట్ చేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ డి.హిమవతి, నెల్లూరు రూరల్ డీఎస్పీ పి.వీరాంజనేయరెడ్డి, నెల్లూరు రూరల్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై నిఘా

సైదాపురం: మండలం నుంచి అక్రమంగా ఖనిజ సంపదను తవ్వి తరలించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాసకుమార్ తెలిపారు. ఆయన ఆదివారం సైదాపురం మండలంలో అక్రమంగా మైనింగ్ చేస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఖనిజాన్ని తవ్వి తరలిస్తున్న రెండు లారీలు, టిప్పర్, జేసీబీని సీజ్ చేసి పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఆయన వెంట విజిలెన్స్ ఏడీ బాలాజీనాయక్ ఉన్నారు.

క్లుప్తంగా

సంగంలో ఓ మోస్తరు వర్షం


సంగంలో వర్షం కురుస్తున్న దృశ్యం

సంగం: మండలంలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని మధ్యాహ్న వేళ ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా వర్షం పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

దుప్పిని రక్షించిన జాలర్లు


జాలర్ల పడవలో దుప్పి

సోమశిల: సోమశిల జలాశయం ఎగువ ప్రాంతంలో నీటి ప్రవాహానికి కొట్టుకొచ్చిన దుప్పిని జాలర్లు కాపాడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్న దుప్పిని గమనించిన జాలర్లు దానిని పట్టుకుని బోటులో క్షేమంగా ఒడ్డుకు చేర్చారు. అనంతరం స్థానిక బీట్ ఆఫీసర్ మహేష్‌కు సమాచారం అందజేయగా దుప్పిని స్వాధీనం చేసుకుని సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

బైక్ అదుపుతప్పి ఉపాధ్యాయుడికి గాయాలు

సంగం: మండలంలోని ర్యాంపు సమీపంలో నెల్లూరు–ముంబై రోడ్డుపై ఆదివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ ఉపాధ్యాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. పొదలకూరు మండలం ఇరువూరుకు చెందిన అంకయ్య చేజర్ల మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆదివారం నెల్లూరులో జరుగుతున్న సమావేశానికి హాజరయ్యేందుకు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా ర్యాంపు సమీపంలో ఎదురుగా ఆకస్మాత్తుగా కుక్క అడ్డు వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో మోటార్‌సైకిల్ అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని స్థానికులు వెంటనే 108 వాహనంలో నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న కారు

- ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన వినయ్

కొడవలూరు: రోడ్డు క్రాస్ చేస్తున్న మోటార్‌సైకిల్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని టపాతోపు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. నార్తురాజుపాలేనికి చెందిన బొచ్చు వినయ్(45) తన స్నేహితుడితో కలిసి మోటార్‌సైకిల్‌పై స్వగ్రామానికి వెళ్లేందుకు టపాతోపు వద్ద జాతీయ రహదారిని క్రాస్ చేస్తుండగా కావలి నుంచి నెల్లూరు వైపు వేగంగా వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వినయ్‌తో పాటు వెనుక ఉన్న స్నేహితుడు గాయపడ్డారు. క్షతగాత్రులను హైవే మొబైల్ పోలీసులు 108 వాహనంలో నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కొడవలూరు పోలీసులకు సమాచారం అందించారు.

బంగారు గొలుసు అపహరణ

నెల్లూరు(క్రైమ్): పాల ప్యాకెట్ కావాలని దుకాణ యజమానురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగుడు అపహరించుకెళ్లిన ఘటన ఆదివారం గాంధీనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు...గాంధీనగర్ 11వ వీధిలో కే సుజాత, రామచంద్రయ్య దంపతులు నివాసం ఉంటున్నారు. సుజాత ఇంటి సమీపంలోనే చిల్లర దుకాణం నిర్వహిస్తోంది. ఆదివారం గుర్తుతెలియని దుండగుడు దుకాణం వద్దకు వచ్చాడు. పాలప్యాకెట్ కావాలని అడిగాడు. ఆమె పాల ప్యాకెట్‌ను ఇచ్చేందుకు లేస్తుండగా దుండగుడు ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లాడు. ఖంగుతిన్న బాధితురాలు తేరుకుని అరిచేలోగా దుండగుడు అక్కడి నుంచి పరుగులు తీస్తూ వీధి చివరలో బైక్‌పై సిద్ధంగా ఉన్న మరో వ్యక్తితో కలిసి పరారయ్యాడు. ఈ మేరకు సుజాత వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య ధీమా



- రూ.25 లక్షల ఉచిత వైద్యం
- ఆరోగ్యశ్రీ పరిమితిని భారీగా పెంచిన ప్రభుత్వం
- జిల్లాలో 8.74 లక్షల కుటుంబాలకు మరింత ఆరోగ్య భరోసా
- నేడు రాష్ట్ర వ్యాప్తంగా వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్

ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యశ్రీ చికిత్సల వివరాలు			ఆరోగ్య ఆసరా లబ్ధిదారుల వివరాలు	
సంవత్సరం	చికిత్సలు	వ్యయం (రూ.కోట్లలో)	లబ్ధిదారుల సంఖ్య	వ్యయం (రూ.కోట్లలో)
2019–20	44,423	122.79	15,995	3.61
2020–21	45,143	108.32	24,908	12.47
2021–22	52,456	139.46	32,905	15.94
2022–23	69,857	148.72	32,005	14.48

20 నుంచి కొత్త కార్డుల పంపిణీ

జిల్లాలోని ఆరోగ్యశ్రీ కార్డుదారులకు ఈ నెల 20 నుంచి నూతన కార్డులను పంపిణీ చేయనున్నారు. జిల్లాలోని 8.74లక్షల కుటుంబాలకు విడతల వారీగా నూతన కార్డులను అందజేయనున్నారు. ఒక్కో నియోజకవర్గంలో 5 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మొదటి విడతలో నూతన డిజిటల్ కార్డులను అందజేయనున్నారు.

నెల్లూరు సిటీ: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి మరింత భద్రత ఏర్పడుతోంది. పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరింత విస్తరించింది. ఈ పథకం కింద వర్తించే ఆరోగ్య చికిత్సల సంఖ్యను దాదాపు మూడు రెట్లు పెంచింది. వైద్య చికిత్సలకు చెల్లించే నగదు మొత్తాన్ని రూ.25 లక్షలకు పెంచుతూ ఆరోగ్య ధీమా కల్పిస్తోంది. గతంలో పేదల చేతిలో నగదు లేక..కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య చేయించుకునే స్థోమత లేక ఎన్నో మరణాలు సంభవించేవి. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలకు కార్పొరేట్ వైద్యసేవలను అందించాలనే సంకల్పంతో ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం చుట్టారు. దేశచరిత్రలోనే వైద్యరంగంలో పెనుమార్పులు తీసుకొచ్చారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందించి లక్షలాది మంది ప్రాణాలను కాపాడారు. ఆయన బాటలోనే తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ కింద అందించే వైద్య సేవల సంఖ్యను మరింత పెంచారు. ప్రస్తుతం మరో చారిత్రాత్మక మార్పునకు శ్రీకారం చుట్టారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ కొత్త కార్డుల పంపిణీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. జిల్లాలో 8,74,690 మంది ఆరోగ్యశ్రీ కార్డుదారులు ఉన్నారు. జిల్లాలోని 64 ప్రభుత్వ, 28 ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యశ్రీ కింద 2,46,697 మంది వివిధ రకాల చికిత్సలు చేయించుకున్నారు. దాదాపు రూ.600కోట్ల వరకు ఆరోగ్యశ్రీ చికిత్సలకు వెచ్చించారు. అలాగే ఆరోగ్య ఆసరా కింద వివిధ చికిత్సలు పొందిన 1,05,548 మందికి రూ.56 కోట్లు అందజేశారు. ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఒక కుటుంబానికి ఏడాదికి రూ.5 లక్షల వరకు వైద్యం చేయించుకునేందుకు వీలుండేది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ వ్యయాన్ని రూ.25 లక్షలకు పెంచడంతో పేద కుటుంబాలకు మరింత ఆరోగ్య భద్రత కలిగింది. గతంలో ఆరోగ్యశ్రీ కింద వేయి చికిత్సలు అందిస్తుండగా, ప్రస్తుతం 3,255 చికిత్సలకు విస్తరించారు. సాధారణ వ్యాధులతో పాటు కేన్సర్, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనం చేకూరనుంది.

నా అక్కకు ఆరోగ్యశ్రీలో కాన్పు చేశారు



నా అక్క రోజాకు ఇటీవల ఆరోగ్యశ్రీ కింద నారాయణ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేశారు. బయట ఆస్పత్రిలో కాన్పుకు వేల రూపాయలు అడిగారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం కింద వెంటనే ఆపరేషన్ చేయడం సంతోషంగా ఉంది.
–జగదీష్, ఉడ్‌హౌస్‌సంఘం, సీఆర్ డొంక

రూ.25 లక్షలకు పెంచడం సంతోషకరం



రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కార్డు పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచడం సంతోషకరం. ఆరోగ్యశ్రీ సేవలతో పాటు పరిమితిని పెంచి పేదలకు మరింత ఆరోగ్య భద్రత కల్పించిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.
–ముసలయ్య, కిసాన్‌నగర్

నూతన కార్డుల పంపిణీకి ఏర్పాట్లు



రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు నూతన కార్డుల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. గ్రామ/వార్డు సచివాలయాల్లో కార్డులను లబ్ధిదారులు తీసుకోవచ్చు.
–చంద్రశేఖర్, జిల్లా కోఆర్డినేటర్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్టు

విహారయాత్రలో విషాదం

- మంగినపూడి బీచ్‌లో మునిగి ట్రిపుల్ ఐటీ విద్యార్థి మృతి
- బందరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు


తోకల అఖిల్ (ఫైల్)


అఖిల్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కోనేరుసెంటర్: మచిలీపట్నం సమీపంలోని మంగినపూడి బీచ్‌లో విషాదం నెలకొంది. విహారయాత్రకు వచ్చిన ఓ విద్యార్థి రాకాసి అలలకు బలయ్యాడు. ఘటనను ప్రత్యక్షంగా చూసిన తోటి స్నేహితులు అలల మధ్య కొట్టుకుపోతున్న స్నేహితుడిని చూసి విలవిల్లాడిపోయారు. ఆదివారం జరిగిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన తోకల అఖిల్ (22) నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలలో ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్నాడు. శనివారం అఖిల్ మరో ఆరుగురు స్నేహితులతో కలిసి విహారయాత్రకు మంగినపూడి బీచ్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఇందు కోసం కళాశాల యాజమాన్యం నుంచి అనుమతి తీసుకున్నారు. శనివారం సాయంత్రం కళాశాల నుంచి బయలుదేరిన ఏడుగురు రాత్రికి విజయవాడ చేరుకుని అక్కడే భోజనాలు చేశారు. అనంతరం విజయవాడ నుంచి రైలులో మచిలీపట్నం చేరుకున్నారు. రాత్రికి రైల్వేస్టేషన్‌లోనే బసచేశారు. ఆదివారం ఉదయం ఆరు గంటల సమయంలో ఆటో మాట్లాడుకుని మంగినపూడి బీచ్‌కు వెళ్లారు. స్నానాలు చేసేందుకు ఇద్దరు స్నేహితులు వెనకడుగు వేయగా మిగిలిన ఐదుగురు బీచ్‌లోకి దిగారు. అలల మధ్య ఆనందంగా గడుపుతున్న వారిపైకి రాకాసి అల ఎగిసి పడింది. అల తాకిడికి ముగ్గురు ఓ వైపునకు ఇద్దరు మరో వైపునకు పడిపోయారు. బందోబస్తులో ఉన్న మెరైన్ పోలీసులు విషయాన్ని గ్రహించి బీచ్‌లో మునిగిపోతున్న ముగ్గురిని పట్టుకుని ఒడ్డుకు చేర్చారు. మిగిలిన ఇద్దరిని కాపాడటానికి యత్నించినా అప్పటికే అఖిల్ కొట్టుకుపోయాడు. అతనితోపాటు మునిగిపోయిన మరో స్నేహితుడ్ని మెరైన్ పోలీసులు ఒడ్డుకు చేర్చారు.

హుటాహుటిన బీచ్‌కు చేరుకున్న సీఐ, ఎస్సైలు

మంగినపూడిబీచ్‌లో యువకుడు గల్లంతైనట్లు సమాచారం అందుకున్న రూరల్ సీఐ రవికుమార్, ఎస్సై చాణక్య, మెరైన్ ఎస్సై బోసు హుటాహుటిన మంగినపూడి బీచ్‌కు చేరుకున్నారు. సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్న సీఐ రవికుమార్ మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మంగినపూడి బీచ్‌తో పాటు పెదపట్నం, తపసిపూడి బీచ్‌ల వద్ద గల్లంతైన యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. తపసిపూడి బీచ్ వద్ద జరుగుతున్న పోర్టు నిర్మాణ పనుల సమీపంలో మృతదేహం కనిపించింది. సీఐతో పాటు ఇద్దరు ఎస్సైలు బోటులో వెళ్లి అఖిల్ మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొచ్చారు.

విలవిల్లాడిన కుటుంబ సభ్యులు, స్నేహితులు

విహారయాత్రకు వచ్చి ప్రాణాలు పోగొట్టుకున్న అఖిల్ మృతదేహాన్ని చూసిన మిగిలిన మిత్రులు చలించిపోయారు. పోలీసుల నుంచి సమాచారం అందుకుని మచిలీపట్నం చేరుకున్న అఖిల్ తల్లిదండ్రులు విగతజీవిగా కనిపించిన కన్నకొడుకును చూసి కన్నీరుమున్నీరయ్యారు. స్నేహితుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు సీఐ రవికుమార్ తెలిపారు.

కూలీ పనులకు వెళ్లొస్తుండగా..

- ఆటోను ఢీకొన్న ట్రాక్టర్
- మహిళ మృతి, మరో నలుగురికి తీవ్రగాయాలు


వెంకమ్మ మృతదేహం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తీవ్ర గాయాలపాలైన సలోమి

గుడ్లూరు: కూలీలతో వస్తున్న ఆటోను కట్టెల లోడు ట్రాక్టర్ ఢీకొనడంతో మహిళ మృతి చెందగా మరో నలుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పూరేటిపల్లి–కళవల్ల రహదారిలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే..గుడ్లూరులోని ఎస్సీ కాలనీకి చెందిన 12 మంది మహిళా కూలీలు వలేటివారిపాళెం మండలం నలదలపూరుకు పనులకు వెళ్లారు. సాయంత్రం తిరిగి ఆటోలో గుడ్లూరుకు వస్తుండగా పూరేటిపల్లి సమీపంలో పెద్దపవని నుంచి కందుకూరుకు చిల్లకర్ర లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలోని గద్దె వెంకమ్మ(55) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. సలోమి, వరమ్మ, దేవమ్మ, దీవెనమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. పూరేటిపల్లి గ్రామానికి చెందిన యువకులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను బయటకు తీసి 108 వాహనంలో కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం సలోమి పరిస్థితి విషమంగా ఉండడంతో ఒంగోలుకు తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌ను నలదలపూరు వద్ద గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఎస్సై ప్రసాద్‌రెడ్డి ప్రమాద ఘటనా స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కూలీ పనులు ముగించుకుని అరగంటలో ఇంటికి చేరుకుంటామనే లోపల ట్రాక్టర్ రూపంలో వచ్చిన మృత్యువు ఆటోను ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని ఎస్సీ కాలనీవాసులు విషాదంలో మునిగిపోయారు.

గడ్డివాములు దగ్ధం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

విడవలూరు: స్థానిక గ్రంథాలయం వీధిలోని మూడు గడ్డి వాములు శనివారం అర్ధరాత్రి అగ్నికి ఆహుతయ్యాయి. బాధితుల వివరాల మేరకు..కొట్టే కృష్ణయ్య పాడి పశువుల కోసం సుమారు 50 ఎకరాల్లోని గడ్డిని కొనుగోలు చేసి మూడు వాములుగా వేసుకున్నాడు. అర్ధరాత్రి వేళ గడ్డి వాముల నుంచి మంటలు ఎగిసి పడుతుండగా గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి ఆర్పేలోగానే గడ్డి వాములు పూర్తిగా కాలిపోయాయి. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పటించడంతోనే ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తూ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

ఉలవపాడు: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని వీరేపల్లి రైల్వే గేటు సమీపంలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే..వీరేపల్లి రైల్వేగేటు సమీపంలో దిగువ లైను 243వ నంబర్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే సిబ్బంది గుర్తించి ఒంగోలు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు కాలర్‌పై గుడ్‌విల్ అనే లేబుల్ కలిగిన తెలుపురంగు చొక్కా, నలుపురంగు ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు 94406 27646 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జగన్‌ను ఎదుర్కొనేందుకు రాబంధులు ఏకం

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్ర ప్రజల అభిమాన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు ప్రజల చేత తిరస్కరణకు గురైన రాబంధులు అన్నీ ఒక్కటవుతున్నాయని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని 13వ వార్డులో పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పేదలకు ఆర్థిక భరోసా కల్పించిందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా గడప గడపకు చేరాయని చెప్పారు. సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన 60 శాతానికిపైగా ప్రజలు వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను పల్లకి మోసేవాళ్లుగానే టీడీపీ చూస్తోందని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ భూస్థాపితం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని ప్రభుత్వం విష ప్రచారం చేసి లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎన్నిల్లో చంద్రబాబుకు 23 ఎమ్మెల్యే స్థానాలే లభించాయని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులు దొరక్క పోటీ కూడా చేయలేదని గుర్తు చేశారు. ఈ రోజు ప్రభుత్వం విష ప్రచారాలతో రాబోయే ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. 2014–2019 మధ్య అద్భుతమైన పాలన అందించి ఉంటే మళ్లీ చక్కని పాలన అందిస్తానని ఎందుకు చెప్పలేకపోతున్నారు..ఒంటరిగా పోటీ చేసే ధైర్యం ఎందుకు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. అవినీతి ఆరోపణల్లో జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చిన చంద్రబాబు రాబోయే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని మైండ్ గేమ్ ఆడుతున్నారన్నారు. హైదరాబాద్‌ను తానే అభివృద్ధి చేశానని, తన వర్గీయుల ద్వారా కాంగ్రెస్ కోసం ప్రచారం చేసిన చంద్రబాబు అక్కడ ఎన్ని సీట్లు గెలిపించారో చెప్పాలని నిలదీశారు. చంద్రబాబు హయాంలో 11.8 శాతంగా పేదరికం ఉంటే, దాన్ని 6 శాతానికి తగ్గించిన ఘనత వైఎస్ జగన్‌దేనని తెలిపారు. చంద్రబాబు హయాంలో 17వ స్థానంలో ఉన్న విద్యావ్యవస్థ జగనన్న తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులతో ఇప్పుడు మూడో స్థానంలోకి వచ్చిందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ సింగిల్‌గానే 151 సీట్లు గెలిచారని, రాబోయే ఎన్నికల్లో 175కు 175 స్థానాలు గెలుచుకోవాలనే సంకల్పంతో అడుగులేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, ఈతముక్కల బాల మురళిరెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, చెన్ను ప్రసాద్‌రెడ్డి, మన్నెమాల శ్రీనివాసులురెడ్డి, కుందుర్తి కామయ్య, పందిటి కామరాజు, తదితరులు పాల్గొన్నారు.

‘పిల్లల పండుగ’ పరిపూర్ణం


చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన



తిరుపతి కల్చరల్ : నగరంలోని ఎస్‌పీజేఎన్‌ఎం హైస్కూల్ రెండ్రోజులుగా నిర్వహిస్తున్న పిల్లల పండుగ ఆదివారంతో పరిపూర్ణమైంది. రోటరీ క్లబ్ సహకారంతో తిరుపతి బాలోత్సవం ఆధ్వర్యంలో చేపట్టిన విశిష్ట కార్యక్రమంలో వందలాది మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. జానపద, శాస్త్రీయ కళా నృత్యాలు, ధ్యానం, ఆటలు, పాటలు, కరాటే, బొమ్మల తయారీ, యోగాసనాలు వంటి సుమారు 29 అంశాలలో పిల్లలకు పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పోటా పోటీగా ప్రతిభ చాటారు. కళా ప్రదర్శనలు, పోటీలతో నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో పండుగ వాతావరణం ఏర్పడింది. ఆదివారం రాత్రి నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తిరుపతి బాలోత్సవం కమిటీ ప్రతినిధులు మల్లారపు నాగార్జున, టెంకాయల దామోదరం, నడ్డినారాయణ, గురునాథం, సుంకర రెడ్డప్ప, మునిరామయ్య, పద్మజ, మునిక్ష్మి, బండి మధుసూదనరెడ్డి, రెడ్డెప్ప పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.20
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.123
లేయర్	రూ.100
బ్రాయిలర్ చికెన్:	రూ.220
స్కిన్‌లెస్ చికెన్:	రూ.244
లేయర్ చికెన్:	రూ.170

